ఈనాడు
పెద్దపల్లి

ఉపాధి హామీలో లక్ష్యాలు అధిగమించేలా చర్యలు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధిహామీలో వంద పని దినాలు పూర్తి చేసే వారి కూలీల సంఖ్య పెంచాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. బుధవారం సమీకృత పాలనా ప్రాంగణంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజువారీగా కూలీల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు. ప్రతి ఊరిలో 12 వేల మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత పెంచేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

17 పంచాయతీలపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లో పాలన పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 3 వేల జనాభా ఉన్న 17 పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పల్లెల్లో గుర్తించిన అభివృద్ధి పనులను ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో చేపట్టాలని సూచించారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని, సెగ్రిగేషన్ షెడ్లను వినియోగించుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

సమగ్ర కుల సర్వేపై ప్రజాభిప్రాయ సేకరణ 1న

సమగ్ర కుల సర్వేపై నవంబరు 1న కరీంనగర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో బుధవారం బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నిర్వహించిన దూరదృశ్య మాధ్యమ సదస్సుకు ఆయన హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లా నుంచి అన్ని కుల సంఘాలు, వర్గాలు, సంచార జాతులు, కుల సంఘాలు కార్యక్రమానికి హాజరయ్యేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

భయం నీడలో బడిబాట

బస్సులు లేక విద్యార్థులకు కష్టాలు

పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నా బస్సులు రాపోవడంతో ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఆర్థిక స్తోమత లేని పేద పిల్లలు కాలినడకన వెళ్తూ అవస్థలు పడుతున్నారు.

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

పాఠశాలల్లో చదువుతున్న దూర ప్రాంత విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు విద్యాశాఖ రవాణా భత్యం ప్రవేశపెట్టింది. 1-5వ తరగతి విద్యార్థులకు కిలోమీటరు దూరానికి నెలకు రూ.400, 6-10వ తరగతులకు 3 కిలోమీటర్ల దూరానికి రూ.600 చొప్పున నిధులు విడుదల కావాల్సి ఉంది. జిల్లాలోని 531 పాఠశాలల్లో 30 వేల మంది చదువుతుండగా 4,500 మందికి రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది. దాదాపు ఆరేళ్లుగా నిధులు జాడ లేదు.

60 కుటుంబాలపై ఆర్థిక భారం



గట్టెపల్లి నుంచి సుల్తానాబాద్‌కు ఇసుక ట్రాక్టర్లపై వస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: గట్టెపల్లి, నీరుకుల్ల, కదంబాపూర్, తొగర్రాయి, గొల్లపల్లి, సాంబయ్యపల్లి, ఐతరాజ్‌పల్లి గ్రామాల బస్సులు లేక సుల్తానాబాద్‌లోని పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు అందుబాటులో లేకుంటే ఇసుక ట్రాక్టర్లు ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. కదంబాపూర్, జెండాపల్లి, తొగర్రాయిలకు చెందిన 60 మంది విద్యార్థినులు నెలకు రూ.900 చొప్పున చెల్లించి గర్రెపల్లి ఆదర్శ పాఠశాలకు వెళ్తున్నారు.

ప్రైవేటు వాహనంలో రాకపోకలు

కాల్వశ్రీరాంపూర్: మడిపల్లి, ఆశన్నపల్లి, మడిపల్లి కాలనీల నుంచి పెగడపల్లి ఉన్నత పాఠశాలకు బస్సు సౌకర్యం లేదు. సుమారు 20 మంది నిత్యం నాలుగు కిలోమీటర్ల దూరం ప్రైవేటు వాహనంలో రాకపోకలు సాగిస్తుండగా ప్రతి నెలా సుమారు రూ.300 చొప్పున వెచ్చించాల్సి వస్తోంది. పందిల్ల నుంచి 22 మంది విద్యార్థులు 8 కిలోమీటర్ల దూరంలోని మల్యాల ఆదర్శ పాఠశాలకు రావడానికి ప్రతి నెలా రూ.1,200 వరకు వెచ్చిస్తున్నారు.



పందిల్ల నుంచి మల్యాల ఆదర్శ పాఠశాలకు వాహనం వెనకాల నిలబడి వస్తున్న విద్యార్థులు

ఇబ్బందుల నడుమ ఇరుకిరుకుగా..



రొంపికుంట బడికి ఆటోలో వస్తూ..

కమాన్‌పూర్: సిద్దిపల్లి, గొల్లపల్లి, రంగాపూర్, పేరపల్లి, నాగారం గ్రామాల నుంచి దాదాపు 20 మంది విద్యార్థులు కమాన్‌పూర్ మండలం రొంపికుంట ఉన్నత పాఠశాలకు వస్తారు. ఇక్కడ సుమారు 224 మంది చదువుతున్నారు. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి అయిదు కిలోమీటర్లకు పైగా దూరం ఉండే ఈ బడికి రావడానికి ఆటోలే దిక్కు. ఈ మార్గంలో గతంలో నడిచిన బస్సును నిలిపివేయడంతో విద్యార్థులు ఇరుకిరుకుగా ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది.

వానాకాలంలో సైకిళ్లపై కష్టాలు



పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలకు ఒకే ఆటోలో వచ్చిన విద్యార్థులు వీరు..

జూలపల్లి: చీమలపేట, నాగులపల్లి, తేలుకుంట, భూపాలపట్నం గ్రామాల నుంచి పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దాదాపు 50 మంది ప్రతి నెలా రూ.600-900 వెచ్చించి బడికి చేరుకుంటున్నారు. ఏటా వాహనదారులు ఛార్జీలు పెంచుతుండటంతో తల్లిదండ్రులకు భారంగా మారింది. ఆ మొత్తం భరించలేని వారు సైకిళ్లపై వస్తున్నారు. వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రానుపోను 6 కిలోమీటర్లు



రాణాపూర్ నుంచి కన్నాల పాఠశాలకు ఆటోలో వెళ్తూ..

పాలకుర్తి: కన్నాల జడ్పీ ఉన్నత పాఠశాల చేరుకోవడానికి రాణాపూర్ విద్యార్థులు రానుపోను 6 కిలోమీటర్లు ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. పుట్నూరు నుంచి జయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాలకు అయిదు కిలోమీటర్లు నడుస్తున్నారు. రాణాపూర్‌కు చెందిన 20 మంది విద్యార్థులు ప్రతి నెలా రూ.400 చొప్పున ఆటోలకు చెల్లించాల్సి వస్తోంది.

పరిశీలన

పది గ్రామాల పిల్లలకు అవస్థలు



ఎక్లాస్‌పూర్ ప్రాథమిక పాఠశాలకు వస్తున్న చిన్నారులు

మంథని గ్రామీణం: ఖానాపూర్, బిట్టుపల్లి, ధర్మారం, రచ్చపల్లి గ్రామాలకు చెందిన 50-60 మంది విద్యార్థులు ఎక్లాస్‌పూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చేరుకోవడానికి ఆటోల్లో 4-10 కి.మీ.లు ప్రయాణిస్తున్నారు. ఖానాపూర్, బిట్టుపల్లి గ్రామాల నుంచి రూ.600, ధర్మారం నుంచి రూ.700 చెల్లిస్తున్నారు. విలోచవరం, పోతారం, లక్కేపూర్, కాకర్లపల్లి గ్రామాల నుంచి 23 మంది ప్రైవేటు వాహనాల్లో 8 కిలోమీటర్లు ప్రయాణించి మంథని ఉన్నత పాఠశాల(బాలుర)కు చేరుకుంటున్నారు. ఇందుకోసం రూ.700-900 చెల్లిస్తున్నారు. సిరిపురం, ఉప్పట్లల నుంచి 28 మంది ఆటోల్లో గుంజపడుగు ఉన్నత పాఠశాలకు చేరుకోవడానికి రూ.600 వెచ్చిస్తున్నారు.

ఏటా రూ.10 వేల వ్యయం



ధర్మారంలో ఆటో కోసం నిరీక్షిస్తూ హోం వర్క్ చేసుకుంటున్న కొత్తపల్లి విద్యార్థులు

ధర్మారం: కొత్తపల్లి, బొమ్మారెడ్డిపల్లి, పెరుకపల్లి, లంబాడితండా(కె), పైడిచింతలపల్లి, గురుపల్లి గ్రామాలకు బస్సులు నడవడం లేదు. పెరుకపల్లి, లంబాడితండా(కె) విద్యార్థులు ధర్మారం, కరీంనగర్‌లకు వెళ్తున్నారు. బంజరుపల్లి వరకు మూడు కిలోమీటర్లు ఆటో లేదా సైకిల్‌పై రావాల్సి వస్తోంది. పైడిచింతలపల్లి, గురుపల్లి విద్యార్థులు రచ్చపల్లి శివారులోని బస్టాపు వరకు కాలినడకన లేదా ద్విచక్రవాహనాలపై రావాల్సి ఉంటుంది. కొత్తపల్లి, బొమ్మారెడ్డిపల్లి విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ధర్మారానికి రావడానికి ఆటోలకు రూ.600-800 వెచ్చిస్తున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏడాదికి రూ.10 వేల వరకు రవాణా వ్యయం అవుతోంది.

లాలపల్లి రహదారికి మోక్షం

రూ.1.60 కోట్లతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

ఈనాడు స్పందనకు వందనం



ఆవిష్కరించిన శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఏటా వానాకాలంలో రహదారి బురదగా మారి, ఆర్టీసీ బస్సులు కూడా రాక ఇబ్బందులు పడుతున్న ఎలిగేడు మండలం లాలపల్లి వాసుల ఇబ్బందులు ఇక తీరనున్నాయి. సీఆర్ఆర్ నిధులు రూ.1.60 కోట్లతో చేపట్టే రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు బుధవారం లాలపల్లిలో భూమిపూజ చేశారు. బీటీ రోడ్డు లేక లాలపల్లి వాసులు పడుతున్న ఇబ్బందులపై కొన్ని నెలలుగా 'ఈనాడు'లో ప్రచురితమైన వరుస కథనాలకు ఎమ్మెల్యే స్పందించారు. ఆయన ప్రత్యేక చొరవతో రహదారి నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. ఎలిగేడు నుంచి లాలపల్లి వరకు రూ.2.40 కోట్లతో ప్రస్తుత రహదారిని విస్తరించడంతో పాటు కేంద్రీకృత విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయనున్నారు. లాలపల్లి నుంచి చీమలపేట క్రాస్‌రోడ్డు వరకు రూ.1.60 కోట్లతో మరో రోడ్డు నిర్మించనున్నారు. ఈ రెండు రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శిలాఫలకం ఆవిష్కరించారు. ఎలిగేడు మండలంలో రూ.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, పరశురాములుగౌడ్, వెంకటేశ్వర్‌రావు, రమేష్, సత్యం, భూమేష్ పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో కళాశాల భవన నిర్మాణం

పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. బుధవారం ఆయన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతమున్న పాత భవనాన్ని తొలగించి, రూ.2 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం



వివాహ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బుధవారం సాయంత్రం నుంచి అందుబాటులోకి వచ్చింది. పట్టణంలోని పాత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. రామగుండం ప్రాంత ప్రజలతో పాటు అంతర్గాం, పాలకుర్తి మండలాల వారికి సేవలందించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం.రవీందర్, జిల్లా రిజిస్ట్రార్ బి.ప్రవీణ్‌కుమార్, రామగుండం ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ తిరుపతి, కార్పొరేటర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇది.. రాజీవ్ రహదారికి ఆనుకొని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ఉన్న అనంత పద్మనాభస్వామి ఆలయానికి చెందిన భూమి. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొన్నేళ్లుగా కుట్రలు జరిగాయి. స్థానికంగా ఉన్న యువత, గ్రామస్థులు ఈ భూమిని కాపాడేందుకు ఏళ్ల తరబడి పోరాటం చేశారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎట్టకేలకు భూమికి హద్దులు నిర్ణయించాలని కోర్టు ఆదేశించింది. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో గుంటకు రూ.30 లక్షల దాకా ఉంటుంది. దేవుడి పేరిట రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో ఇక్కడ 10.10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు హద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మిస్తే దేవుడి మాన్యానికి రక్షణ ఉంటుంది.



ఆక్రమణలో 818 ఎకరాల ఆలయ స్థలాలు

దేవుడి భూమినీ వదలడం లే!

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు సంబంధించిన భూములు కాలక్రమేణా ఆక్రమణకు గురవుతున్నాయి. 1955-56 కాస్రా పహాణితో పోలిస్తే ఇప్పుడు రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం తగ్గింది. దేవాదాయ శాఖ అధికారులు చెప్పిన వివరాల మేరకే 818 ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇది ధరణి పోర్టల్‌లో ఉన్న ప్రస్తుత లెక్కల ప్రకారం. కాని అనధికారికం సుమారుగా 1500 ఎకరాల వరకు ఆలయాల భూమి కబ్జా చెరలో చిక్కుకున్నట్లు సమాచారం. ఆలయ భూములను ఆనుకుని ఉన్న వారు హద్దులు చెరిపేస్తూ ఆక్రమించడం, ఆ తరువాత కోర్టులను ఆశ్రయించడంతో ఏటా కొంత భూమిని దేవాదాయ శాఖ కోల్పోతూ వస్తోంది. అధికారులు మారుతుండటం, గ్రామాల్లో ఆలయ భూములెక్కడ ఉన్నాయో స్పష్టత లేకపోవడంతో సంరక్షణ కష్టసాధ్యమవుతోంది.

జిల్లా	ఆలయాలు	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఆక్రమణ
కరీంనగర్	101	713.04	144.30
జగిత్యాల	118	1,173.34	86.29
పెద్దపల్లి	111	1,131.09	551.36
సిరిసిల్ల	93	617.18	35.01
మొత్తం	423	3635.25	818.16

ఊరూరా ఇదే తీరు..!

హుజూరాబాద్ హనుమాన్ ఆలయానికి చెందినవి 1.14 ఎకరాలు, సిరిసిల్ల వేంకటేశ్వరస్వామి ఆలయ పరిధిలో 1.15 ఎకరాలు, పెద్దపల్లి గోశాలలో 1.13 ఎకరాలు, పెద్దపల్లి సీతారామస్వామి ఆలయ పరిధిలో 8.32 ఎకరాలు, జగిత్యాల రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిధిలో 2.04 ఎకరాలు, కోరుట్ల వేంకటేశ్వరస్వామి ఆలయానివి.. 20 గుంటలు, జగిత్యాల రాంమందిర్ భూమి 19 గుంటలు, పెద్దపల్లి నర్సింహాస్వామి భూమి 13.20 ఎకరాలు, కొండగట్టు ఆలయ భూములు రెండెకరాలు.. ఇలా అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ఆలయ భూములు ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. ఇందులో చాలామంది ఆక్రమణదారులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో తిరిగి స్వాధీనం చేసుకోవడం యంత్రాంగానికి సవాలుగా మారుతోంది. కొన్ని కేసుల్లో దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పులు రావడంతో.. వీటిని సెక్షన్-84 ప్రకారం పోలీసులు, రెవెన్యూ సహకారంతో స్వాధీనపర్చుకుంటున్నారు.

స్వాధీనం చేసుకుంటాం

ఎట్టి పరిస్థితుల్లో దేవుడికి సంబంధించిన గుంట భూమిని కూడా ఆక్రమణదారులకు వదిలిపెట్టం. కచ్చితంగా స్వాధీనపర్చుకుంటాం. చాలా కేసుల్లో మా శాఖకు అనుకూలంగా తీర్పులు వస్తున్నాయి. త్వరలోనే రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఇదే సమయంలో ధరణి పోర్టల్‌లో ఉన్న రికార్డుల ఆధారంగా ప్రతి జాగాను కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు లేఖ రాశాం.

- సుప్రియ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

మురుగు కాదు.. నగరపాలిక తాగునీరు



చిత్రంలో కనిపిస్తోంది మురుగు నీరు అనుకుంటే పొరపాటే. రామగుండం నగరపాలిక కుళాయిల్లో సరఫరా చేసే సురక్షిత జలం. 50వ డివిజన్‌లోని స్వతంత్రచౌక్‌లో గృహాలకు కుళాయిల్లో వచ్చే తాగునీరు ఇది. పైపులైనులో లీకేజీ కారణంగా మురుగు కలుస్తుండటమే ఇందుకు కారణం. కుళాయిలో నీరు వస్తుందంటే దుర్గంధం భరించలేక ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వాపోతున్నారు. గతంలోనూ ఇదే పరిస్థితి నెలకొనగా స్థానికుల విన్నపాలతో లీకేజీ నివారణ చర్యలు చేపట్టారు. పక్షం రోజులుగా మళ్లీ ఇదే పరిస్థితి. ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందిస్తున్నామని పాలకులు చెప్పుకుంటున్నప్పటికీ నగరంలోని సుమారు వెయ్యికిపైగా కుళాయిల్లో నీరు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగడానికి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుండగా ఇతర అవసరాలకు దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' నగరపాలక నీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో పరిశీలిస్తామని పేర్కొన్నారు.

–న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

జిల్లాకో ఔషధ కేంద్రం..

తగ్గనున్న దూరాభారం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

కొత్త జిల్లాలకు ఉమ్మడి జిల్లా కేంద్రాలు దూరంగా ఉండటంతోపాటు మందుల సరఫరా నిర్వహణ ఇబ్బందిగా ఉంటుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇటీవల ప్రతి జిల్లాలో 'సెంట్రల్ డ్రగ్ స్టోర్(కేంద్ర ఔషధ గిడ్డంగి)'ని ఏర్పాటుచేశారు. జగిత్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో, రాజన్న సిరిసిల్లకు సంబంధించి వేములవాడ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నెలకొల్పారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ క్షయ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేశారు. అయితే ఇక్కడ ఏర్పాటు చేయడంపై పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ తదితర ప్రాంతాలకు అందుబాటులో ఉన్నప్పటికీ.. గోదావరిఖని, మంథనికి దూరం అవుతున్నట్లు భావిస్తున్నారు.

కొరత తీరితేనే ప్రయోజనం

సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ప్రభుత్వమే మందులను ఆయా ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే చాలా సందర్భాల్లో ఆయా ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల నిర్వాహకులే వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది. పిల్లలతోపాటు పెద్దలకు అవసరమైన కొన్ని వ్యాధి నిరోధక టీకాలు, జ్వరం, నొప్పులు, జలుబు, దగ్గు నివారణకు సంబంధించిన మాత్రలు అందుబాటులో ఉండటం లేదని పలువురు చెబుతున్నారు. దీంతో బయట కొనుక్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఖనిలో ఏర్పాటుకు వినతులు

డ్రగ్ స్టోర్‌ను గోదావరిఖనిలో ఏర్పాటు చేసినట్లయితే మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ తదితర ప్రాంతాలకు అందుబాటులో ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఖాళీగానున్న ప్రభుత్వ వైద్య కళాశాల తాత్కాలిక బాలుర వసతి గృహం(సింగరేణి అతిథి గృహం)లో ఏర్పాటు చేయాలని వైద్య కళాశాల ప్రిన్సిపల్ కోరారు. జిల్లాలో మందుల వినియోగం అత్యధికంగా ఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉండటంతో ఇక్కడే డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేయడం సమంజసమని భావించారు. సుల్తానాబాద్‌లో విశాలమైన క్షయ ఆసుపత్రి భవనం ఖాళీగా ఉండటంతో అక్కడే సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నట్లుగా చెబుతున్నారు.

రెట్టింపు చేసినా మందులేవీ?

గతంలో సుమారు 400 రకాల మందులను సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి సరఫరా చేయాల్సి ఉండగా.. గత ప్రభుత్వ హయాంలో దీనిని రెట్టింపు చేశారు. అయితే ప్రస్తుతం వంద రకాల లోపు మందులు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో ఉండే ఫార్మసీ సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇటీవలే ఫార్మసిస్టుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసి మందుల కొరత లేకుండా చూడాలని కోరారు.



సుల్తానాబాద్ గిడ్డంగిలో ఔషధాలను సర్దుతున్న సిబ్బంది

అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో నిరంతరం వినియోగించే మందులను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా వ్యాక్సిన్ల కొరత ఏర్పడితే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. సుల్తానాబాద్‌లో ఏర్పాటుచేసిన సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు మందులను సరఫరా చేస్తాం. **- డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెద్దపల్లి**

త్వరలో ఎలిగేడులో రాణా ఏర్పాటు

ఎలిగేడు(సుల్తానాబాద్): ఎన్నికల హామీ మేరకు ఎలిగేడులో అతి త్వరలో రాణా ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. ఎలిగేడు, లాలపల్లిలో సీఆర్ఆర్ నిధులతో నిర్మించనున్న బీటీ రహదారుల నిర్మాణానికి, లాలపల్లి బీరన్న ఆలయంలో సీసీ ఏర్పాటు, ప్రహరీ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు సామ రాజేశ్వరరెడ్డి, నాయకులు సంతోష్‌రావు, విజయభాస్కర్, వెంకటేశ్వరరావు, ఎంపీడీవో భాస్కరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు...

నేడు ప్రపంచ పోలియో దినోత్సవం



న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

ఒకప్పుడు ప్రపంచాన్ని వణికించిన పోలియో మహమ్మారిని సమూలంగా తరిమి కొట్టడంలో 'రెండు చుక్కలు' కీలకమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 3.5 లక్షల పోలియో కేసులు నమోదు అవుతుండగా వైద్య ఆరోగ్య శాఖతో పాటు వివిధ వర్గాలు తీసుకున్న చర్యలతో ఒకటి రెండు దేశాల్లో మినహా ప్రపంచ వ్యాప్తంగా పోలియో మహమ్మారిని నిర్మూలించారు. పోలియో కేసులు నమోదవుతున్న దేశాల నుంచి వచ్చే వారి ద్వారా ఇతర దేశాల్లోనూ వ్యాపించే ప్రమాదముందని భావించి ఏటా రెండుసార్లు అయిదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయిస్తున్నారు. అఫ్గనిస్థాన్, పాకిస్థాన్‌లో పోలియో వైరస్ ఉన్నట్లు గుర్తించగా 2022లో ఆగ్నేయ ఆఫ్రికాలో పాకిస్థాన్‌నుంచి సంక్రమించిన వైరస్‌ను గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా దీనిని అరికట్టేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

■ పోలియో టీకా అభివృద్ధి చేసిన వైద్య పరిశోధన బృందానికి నాయకత్వం వహించిన జోనస్ సాల్క్ జన్మదినోత్సవం సందర్భంగా అక్టోబరు 24న ప్రపంచ పోలియో డే నిర్వహిస్తున్నారు. ఒక్కో సంవత్సరం ఒక్కో నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ సారి 'ఎ ఛాన్స్ ఫర్ రిఫ్లెక్షన్ అండ్ రిమైండర్ టు రీచ్ ఎవ్రీ లాస్ట్ చైల్డ్' నినాదంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళిక రూపొందించింది.

నిరంతర పర్యవేక్షణ

పోలియో వైరస్ అయిదేళ్ల లోపు చిన్నారులను అత్యధికంగా ప్రభావితం చేస్తుంది. మల, నోటి మార్గం ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. ఇది పేగుల్లోకి చేరి నాడీ వ్యవస్థలోకి ప్రవేశించి పక్షవాతానికి కారణమవుతుంది. అరుదుగా సోకే అంటువ్యాధి అయినప్పటికీ ఈ వైరస్ మెదడులోని కొన్ని కణాలను భారీగా దెబ్బ తీస్తుంది. పోలియో మహమ్మారిని సమూలంగా నిర్మూలించినప్పటికీ ఎప్పుడైనా వ్యాపించే ప్రమాదముందనే భావనతో ప్రపంచ వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంటూ చర్యలు చేపడుతోంది. పదిహేనేళ్ల లోపు పిల్లల్లో పక్షవాతం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వారి రక్త నమూనాలను సేకరించి పుణేలోని పరిశోధన కేంద్రానికి పంపుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏటా సుమారుగా పాతికకు పైగా ఇలాంటి నమూనాలను సేకరించి పంపిస్తున్నప్పటికీ పోలియో సోకినట్లుగా నిర్ధారణ కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

నిర్లక్ష్యం వీడి అవగాహన పెంచుకోవాలి

గత కొన్నేళ్లుగా దేశంలో ఎలాంటి పోలియో కేసులు నమోదు కావడం లేదు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఈ మహమ్మారి దరిదాపుల్లోకి రాకుండా జాగ్రత్త వహించాలి. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు. ఏమాత్రం లక్షణాలు కనిపించినా వెంటనే అవసరమైన నమూనాలను సేకరించి నిర్ధారణ కోసం పంపిస్తున్నాం. - డాక్టర్ ప్రమోద్‌కుమార్, పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి



కాల్‌డేటానే కీలకం

గంగారెడ్డి హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం

జగిత్యాల, జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి హత్య సంచలనం కలిగించగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు సంతోష్ లొంగిపోయినప్పటికీ హత్యకు ప్రోత్సహించింది ఎవరు అనే కోణంలో పోలీసులు సమాచారాన్ని రాబడుతున్నారు. ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్ కేసుపై ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం పోలీసులు సీన్ ఆఫ్ అఫెన్స్ నిర్వహించారు. విచారణలో నిందితుడు తాను ఒక్కడినే నేరం చేశానని ఒప్పుకొన్నప్పటికీ కాల్‌డేటా ఆధారంగా ఇంకా ఎవరి ప్రమేయం ఉన్నది అనే కోణంలో పోలీసులు దృష్టి సారించారు. కాలడేటాలో దాదాపు 25 మందికిపైగా గుర్తించినట్లు తెలుస్తుండగా అందులో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్న వ్యక్తుల నంబర్లలో ఉన్న వారిని విచారించే అవకాశం ఉంది. బుధవారం సాయంత్రం వరకు నిందితుడు సంతోష్ తప్ప ఎవరిని అదుపులోకి తీసుకోలేదని పోలీసులు తెలిపారు. ఈ కేసు సంచలనం కలిగించటంతో పోలీసు ఉన్నతాధికారులు సైతం ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

విషాదంలో జాబితాపూర్....

నిత్యం గ్రామంలో అందరితో కలిసి తిరిగే మారు గంగారెడ్డి మృతితో ఆయన స్వగ్రామం జాబితాపూర్‌లో విషాదం నెలకొంది. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి కేసు దర్యాప్తుపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. సన్నిహితులు, బంధువులు ఘటనను జీర్ణించుకోలేకపోతున్నారు. మంత్రి శ్రీధర్ బాబు సైతం హత్య ఘటనపై విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని గాంధీభవన్ నుంచి ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డితోనూ మంత్రి మాట్లాడి పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి


నిందితుడి వెనుక ఉన్నది ఎవరు?

నిందితుడు సంతోష్ ఒక్కడే ఈ హత్య చేశాడా? అతని వెనుక ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. జులాయిగా తిరిగే సంతోష్‌కు ఇంత ధైర్యం ఎలా వచ్చిందని కూడా గంగారెడ్డి సన్నిహితులు పేర్కొంటున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు సైతం గ్రామంలో కొందరు అనుమానితులపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. నిందితుడి కాల్‌డేటాలో కుటుంబ సభ్యులు అనుమానిస్తున్న వ్యక్తుల ఫోన్ నంబర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారిని సైతం విచారిస్తే అసలు నిజం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. నిందితుడిని ఎంత విచారించినా తాను ఒక్కడినే చేశాను.. ఇందులో ఎవరి పాత్ర లేదని చెబుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిందితుడు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకోగా కత్తిని సైతం గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరికొంత మందిని అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉంది. గ్రామంలో బుధవారం కొందరు అనుమానితులను పోలీసులు విచారించారు.

మెకానిక్ నుంచి సినిమాల వైపు


సినిమా, వెబ్ సిరీస్ దర్శకుడిగా రాణిస్తున్న కోరుట్ల వాసి

కోరుట్ల, న్యూస్‌టుడే: మెకానిక్ నుంచి దర్శకత్వం వైపు మళ్లి.. సినిమా, వెబ్ సిరీస్ దర్శకుడిగా రాణిస్తున్నారు కోరుట్ల పట్టణానికి చెందిన ముల్క గగన్ గోపాల్. మధ్య తరగతి కుటుంబానికి చెందిన గగన్ గోపాల్ ముంబయిలో ద్విచక్ర వాహన మెకానిక్‌లో శిక్షణ పొంది 1992 నుంచి 2007 వరకు కోరుట్ల పట్టణంలో మెకానిక్‌గా పనిచేశారు. సినిమాల పట్ల ఉన్న ఆసక్తితో 2008లో హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో 6 నెలలపాటు శిక్షణ పొందారు. 2009 నుంచి 2013 వరకు ఎనిమిది సినిమాలకు దర్శకత్వ పర్యవేక్షకుడిగా పనిచేశారు. 2018లో ప్రముఖ తెలుగు నటుడు కమల్ కామరాజు హీరోగా 'లా' అనే సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్, దర్శకుడిగా వ్యవహరించారు. కరోనా వల్ల సినిమాలకు కొంత విరామం వచ్చినా 2023లో మొదలుపెట్టిన 'అండర్ వరల్డ్ బిలియనీర్స్' అనే వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ఇందులో బాలీవుడ్, తెలుగు, తమిళ, కన్నడ, మళయాళంకు చెందిన ప్రముఖ నటులు నటించారు. దీనిని అయిదు భాషలలో ఒక్కో ఎపిసోడ్ 30 నిమిషాల చొప్పున మొత్తం 12 ఎపిసోడ్‌లుగా చిత్రీకరించగా ప్రస్తుతం చివరి దశలో ఉంది. 'లా' అనే సినిమాకు స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైలాగ్‌లు అందించి మొదటిసారి దర్శకత్వం వహించానని ప్రస్తుతం 'అండర్ వరల్డ్ బిలియనీర్స్' అనే వెబ్ సిరీస్‌కు దర్శకత్వంతోపాటు స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైలాగ్‌లు రాశానని అయిదు భాషల్లో విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు గగన్ గోపాల్ తెలిపారు.



లా సినిమా చిత్రీకరణలో కమల్ కామరాజుకు సీన్‌ను వివరిస్తున్న గగన్ గోపాల్

విద్యార్థుల సమాచార నిధి... అపార్



న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

ఇటీవల వరదలు సంభవించినప్పుడు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలన్నీ వరదపాలయ్యాయి. తిరిగి వాటిని పొందేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వారి ధ్రువీకరణ పత్రాలతో పాటు విద్యావిషయక పురోగతిని డిజి లాకర్‌లో భద్రపరచుకునేలా ప్రభుత్వం 'అపార్' రూపొందించింది. విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)లో భద్రపరచనున్నారు. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి జీవితకాలం ఉపయోగపడే 12 అంకెల గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల సమగ్ర వివరాలను 'అపార్'లో నమోదు చేస్తారు. ఈ నెంబరుతో పాటు క్యూఆర్ కోడ్‌తో ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డు జారీ చేస్తారు. ఈ నెంబరు ఆధారంగా విద్యార్థులు ఎక్కడినుంచైనా వారి ధ్రువీకరణ పత్రాలను పొందే వీలుంటుంది. ఆయా అంశాలకు సంబంధించి పురోగతిని ఆయా పాఠశాలల నిర్వాహకులు ఎప్పటికప్పుడు అపార్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులు వేరే విద్యా సంస్థల్లోకి మారినప్పుడు, ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు ఈ వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచుతుంది.

తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరి

పాఠశాల విద్యార్థులు మైనర్లు కావడంతో చట్ట, నైతిక ప్రమాణాలను, వ్యక్తిగత సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమ్మతి అవసరం. 'అపార్' ఐడీని రూపొందించేందుకు తల్లిదండ్రుల అనుమతి కోరుతూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అనుమతి పత్రాలను సేకరిస్తున్నారు. ఇటీవల జరిగిన పోషకుల సమావేశంలో 'అపార్'పై అవగాహన కల్పించి అనుమతి పత్రాలను తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన అనుమతి పత్రాలను పాఠశాలలో భద్రపరిచి దాని డిజిటల్ కాపీని పాఠశాల సమన్వయ కర్త ద్వారా యుడైస్ ప్లస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు.



వెబ్‌సైట్ హోమ్‌పేజీ

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
జగిత్యాల	1,165	1,59,585
కరీంనగర్	1,071	1,57,648
పెద్దపల్లి	784	98,240
సిరిసిల్ల	659	87,390

భవిష్యత్తులో కీలకం

విద్యార్థులకు భవిష్యత్తులో 'అపార్' కీలకం కానుంది. తల్లిదండ్రులు తమ సమ్మతి పత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. ఆయా వివరాల నమోదుపై ఇప్పటికే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తూ సమ్మతి పత్రాలను తీసుకునేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. - **బి.సుదర్శన్‌రెడ్డి, సమన్వయకర్త, రామగుండం**

జాతీయ స్థాయిలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇప్పటికే 'యుడైస్ ప్లస్' సైటలో వివరాలు నమోదు చేశారు. వాటి అనుగుణంగా 'అపార్' కార్డు కోసం ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రత్యేకతలు... ప్రయోజనాలు

ఐడీ వచ్చిన తరువాత ధ్రువీకరణ కోసం తల్లిదండ్రులు నమోదు చేసుకున్న ఫోన్‌నెంబరుకు నిర్ధారణ కోసం ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయగానే ఆన్‌లైన్‌లో 'అపార్' గుర్తింపు కార్డు జారీ చేస్తారు. విద్యార్థి బ్యాంకు ఖాతా వివరాలతో ఇది అనుసంధానమవుతుంది. విద్యార్థి ప్రవేశ పరీక్షలు, ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ సమయంలో ఇది కీలకం కానుంది.

గుర్తింపు కార్డు నమూనా →



రైల్వే అభివృద్ధి ప్రతిపాదనలపై నేడు సమావేశం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చించేందుకు గురువారం అధికారులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నారు. ద.మ.రై. జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మన రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు పలు పనులను ప్రతిపాదించనున్నారు. వీటిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి విశాఖ-శిర్డీ మధ్య నడిచే సాయినగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను పెద్దపల్లి, నిజామాబాద్ మీదుగా మళ్లించడం, కాచిగూడ-కరీంనగర్ మధ్య నడిచే డెమోను పెద్దపల్లి వరకు పొడిగించడం, జగిత్యాలలోని లింగంపేట రైల్వే ప్లాట్‌ఫాంను విస్తరించడంతో పాటు పెద్దపల్లి, నిజామాబాద్ రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలనే ప్రతిపాదనలున్నాయి.

నాణ్యమైన పత్తికే సీసీఐ మద్దతు ధర

ఆర్‌జేడీఎం శ్రీనివాస్

జమ్మికుంట, న్యూస్‌టుడే: నాణ్యమైన పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చి ప్రభుత్వ కనీస మద్దతు ధరను పొందాలని వరంగల్ ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు(ఆర్‌జేడీఎం) శ్రీనివాస్ సూచించారు. బుధవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌డీడీఎం పద్మావతి, కరీంనగర్ డీఎంవో ప్రకాష్, ఆర్డీవో రమేశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. మొదటిరోజు ఓ రైతు విక్రయానికి తీసుకువచ్చిన ట్రాక్టర్ పత్తికి క్వింటాలు రూ.7,270.37 చొప్పున సీసీఐ బాధ్యులు చంద్రశేఖర్ ఖరీదు చేశారు.

8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే..: ఆర్‌జేడీఎం మాట్లాడుతూ.. మద్దతు ధర పొందేందుకు నాణ్యమైన, నాణ్యతలేని పత్తిని వేర్వేరుగా విక్రయానికి తీసుకురావాలన్నారు. నాణ్యతను బట్టి 8 శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే సీసీఐ రూ.7,521 నుంచి రూ.7,220.16 దాకా చెల్లిస్తుందన్నారు. నీళ్లు చల్లి, రంగుల మారిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదనే విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌తోపాటు స్థానిక ఏడు జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసిందన్నారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం, రాజా, అడ్తి వ్యాపారుల సంఘం అధ్యక్షులు రాజేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


■ బుధవారం ఒక్కరోజే యార్డుకు 223 ట్రాలీల విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో విడిపత్తి కనిష్ఠ ధర రూ. 6 వేల నుంచి రూ.7 వేల దాకా పలికింది. మంగళవారం కంటే తాజాగా రూ.200 పెరిగింది.



పత్తి కొనుగోలును ప్రారంభిస్తున్న వరంగల్ ఆర్‌జేడీఎం శ్రీనివాస్

ఎమ్మెల్యే గంగులకు పరామర్శ

రాంపూర్ (కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సమ్మ మృతిచెందడంతో పలువురు బుధవారం కరీంనగర్‌లో గంగుల కమలాకర్‌ను పరామర్శించారు. వీరిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు టి.హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కౌశిక్‌రెడ్డి, సత్యం, ఎంపీ వి.రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రవిశంకర్, రామకృష్ణారెడ్డి, మేయర్ వై.సునీల్‌రావు, భారాస జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు ఉన్నారు. లక్ష్మీనర్సమ్మ అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు.



లక్ష్మీనర్సమ్మ భౌతికకాయం వద్ద మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తదితరులు

అధిక ధరలకు విక్రయం..

రూ.లక్షల్లో అక్రమం

వెండర్ల స్టాంపు పేపర్ల బాగోతం

న్యూస్‌టుడే, కరీంనగర్ సంక్షేమ విభాగం

స్టాంపు పేపర్లు అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు కొందరు స్టాంప్ వెండర్లు. రిజిస్ట్రేషన్ శాఖలో క్రయవిక్రయాలు జరిపేందుకు స్టాంపు పేపర్లు అవసరమవుతాయి. వివిధ పనుల కోసం ఉద్యోగులకు... నూతన ఉద్యోగాలలో చేరడానికి నిరుద్యోగులకు, ఉన్నత చదువు నిమిత్తం విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాలలో స్టాంపు పేపర్లు కావాల్సి ఉంటుంది. తెలిసిన వారు వెళ్తే 100 స్టాంపు కాగితం రూ.120, తెలియని వారు వెళ్తే అదే స్టాంపు కాగితం రూ.150 వరకు విక్రయిస్తున్నారు. తీసుకుంటే తీసుకోండి లేదంటే మీ ఇష్టం.. అనే సమాధానం వస్తుందని పలువురు కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఈ తతంగం అంతా ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో జరగడంలేదు. అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల సమీపంలోని కొందరు గదులు అద్దెకు తీసుకొని అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. ఈవిషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఏటా 50 లక్షలకు పైగా సరఫరా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 14 రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నాయి. ఏటా ప్రధాన కార్యాలయం నుంచి కరీంనగర్ ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయానికి 50 లక్షలకు పైగానే స్టాంపు పేపర్లు వస్తున్నాయి. వీటన్నింటిని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేస్తారు. వారు లైసెన్సు పొందిన స్టాంప్ వెండర్లకు అందజేస్తారు. అధికారులు వచ్చిన వాటిని స్టాంప్ వెండర్లకు అందించడం వరకే బాధ్యత తీసుకుంటున్నారు. అనంతరం వారు ఎంతకు విక్రయిస్తున్నారు. నిబంధనలు ఏంటని అటు వైపు చూడటమే మానేశారు.

చూస్తే చిల్లరే.. లెక్కిస్తే భారీ మొత్తం


ఎంత ధర ఉంటే అంతకే విక్రయించాలని నిబంధనలున్నా వాటిని తుంగలో తొక్కుతున్నారు. దాదాపు ప్రతి పనికి స్టాంపు పేపర్లు అత్యంత కీలకం. వివిధ రకాల ఒప్పందాలకు, వాహన క్రయవిక్రయాలకు, అప్పులకు చాలా అవసరం. వారికి ఉన్న అత్యవసర పరిస్థితిని ఆసరా చేసుకొని ఎక్కువగా విక్రయిస్తున్నారు. అధిక ధరకు విక్రయించేవారు ప్రతి రోజు దాదాపు 50కిపైగా విక్రయిస్తున్నారు. ఒక్కో దానిపై రూ.50 అధికంగా తీసుకున్నా రోజుకు రూ.2500 వరకు వస్తుంది. ప్రభుత్వం 5 శాతం కమీషన్ ఇస్తోంది. అక్రమ సంపాదనకు మరిగిన కొందరూ అందినకాడికి దండుకుంటున్నారు. ప్రతి వెండర్ అక్రమంగా నెలకు రూ.50,000 వరకు ఆర్జిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వంద మంది ఉన్నా.. రూ.50 లక్షల వరకు ప్రజలపై భారం పడుతోంది.



కూత వేటుదూరంలో ఉన్నా చూడరా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతోపాటు అన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో స్టాంప్ వెండర్ల దుకాణాలున్నాయి. అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తే అన్నీ విషయాలు తెలుస్తాయి. అయితే వారు ఇప్పటివరకు తనిఖీ చేసిన సందర్భాలు లేవు. చాలామంది బహిరంగంగానే స్టాంపు కాగితాలు అధిక ధరకు తీసుకుంటున్నారని ఆరోపించినా.. ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 మందికిపైగా స్టాంప్ వెండర్లు ఉంటే అందులో దాదాపు అధిక మంది ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల అంత ఒక్కటై విక్రయిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే లైసెన్సు రద్దు



వెండర్లు నిబంధనల ప్రకారం ఉన్న ధరకే స్టాంపు కాగితాలు విక్రయించాలి. ఎవరికైనా అధికంగా విక్రయిస్తే సమీపంలోని అధికారుల దృష్టికి తీసుకురావాలి. విచారణ చేసి వారి లైసెన్సులు రద్దు చేస్తాం. మొదట ప్రజలు ప్రశ్నించే దృక్పథం అలవాటు చేసుకోవాలి.

- ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

వేములవాడలో చిన్నారి విక్రయం కలకలం

పోలీసులకు తల్లి ఫిర్యాదు



బిడ్డతో శ్యామల

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలో ఓ చిన్నారి విక్రయం కలకలం రేపింది. భిక్షాటన చేసే ఓ మహిళ తాగిన మైకంలో పది నెలల పాప మేఘనను మరో మహిళకు విక్రయించి, తిరిగి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డిపేటకు చెందిన శ్యామల, రవీందర్ దంపతులు గత కొంత కాలంగా వేములవాడలో నివాసం ఉంటున్నారు. రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదుగురు సంతానం కావడంతో చిన్నపాపను విక్రయించాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని గతంలో తమకు పరిచయం ఉన్న జగిత్యాల జిల్లా గోవింద్‌పల్లెకు చెందిన లక్ష్మికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వేములవాడ వచ్చిన లక్ష్మితో పాటు శ్యామల కుటుంబ సభ్యులు మంగళవారం తిప్పాపూర్‌లో మద్యం తాగారు. తాగిన మైకంలో రూ.90 వేలకు లక్ష్మికి విక్రయించారు. స్టాంప్ పేపరుపై రాయించి ఇచ్చారు. బుధవారం తన పాపను లక్ష్మి అపహరించిందని శ్యామల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. తనకు రూ.90 వేలకు విక్రయించారని లక్ష్మి తెలిపింది. ఆమె వద్ద ఉన్న బాలికను తిరిగి శ్యామలకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

4 నుంచి ఎల్ఎల్ఎం పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు కూడా అదే రోజు నుంచి మొదలవుతాయని.. ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 6 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, సుల్తానాబాద్

? సుల్తానాబాద్ నుంచి గట్టెపల్లికి రూ.కోటితో ఇటీవల చేపట్టిన తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించక కుంగిపోతోంది. మూడో లేయర్ వేయకుండానే వదిలేశారు. -శంకర్, గ్రామస్థుడు

✓ రహదారి నాణ్యతను పరిశీలించి మిగిలిన పనులను గుత్తేదారుతో చేయిస్తాం. -బాషా, ఆర్‌అండ్‌బీ ఏఈ

చట్టాలపై అవగాహనతోనే సత్వర న్యాయం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి స్వప్నరాణి సూచించారు. పెద్దపల్లి మండలం నిట్టూరులో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ పేదలకు ఉచిత న్యాయం అందించేందుకు జిల్లా కేంద్రంలోని న్యాయ సేవా సంస్థ పని చేస్తుందన్నారు. న్యాయవాదులు ఎస్.శ్రీనివాస్, శరత్, పంచాయతీ కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు అవసరాలకు పంచాయతీ ట్యాంకరు

ముత్తారం, న్యూస్‌టుడే: మొక్కల సంరక్షణకు వినియోగించాల్సిన పంచాయతీ నీటి ట్యాంకరును ప్రైవేటు అవసరాలకు వినియోగించడం ముత్తారం మండలం పోతారంలో వివాదాస్పదమైంది. గ్రామంలో అధికార పార్టీకి చెందిన నాయకుడి ఇంటి నిర్మాణ పనులకు మైదంబండ పంచాయతీకి చెందిన ట్యాంకరును వినియోగిస్తున్నారు. ప్రజా అవసరాల కోసం సమకూర్చిన ట్రాక్టరును సొంత పనులకు వినియోగించుకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో సురేశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పంచాయతీ ట్యాంకరు వినియోగానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.



ఇంటి నిర్మాణం పనుల కోసం వినియోగిస్తున్న నీటి ట్యాంకరు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఆందోళన

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రామగుండం నగరపాలక అధికారులకు తెలంగాణ మున్సిపల్ కార్మికుల సంఘం(సీఐటీయూ) నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. 8 గంటల పనివిధానం అమలు చేయాలని, మృతి చెందిన కార్మికుల అంత్యక్రియల సంస్కారాల కోసం రూ.30 వేలు తక్షణ సహాయం ఇవ్వాలని, పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న అర్హులైన వారికి పారిశుద్ధ్య పర్యవేక్షకులుగా, డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా అవకాశం కల్పించాలని, విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలని కోరారు. శుక్రవారం చేపట్టనున్న ఆందోళనను విజయవంతం చేసేలా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సంఘం నాయకులు రాధాకృష్ణ, కిషన్ నాయక్, సారయ్య, శోభన్ తదితరులు పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మహమ్మద్ ఖలీమ్

జ్యోతినగర్(మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే: గోదావరిఖని ప్రశాంతినగర్‌లోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్న మహమ్మద్ ఖలీమ్(38) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో ఉంటున్న తన తల్లి వద్దకు వెళ్లేందుకు ఖలీమ్ విధులు ముగించుకుని స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎన్టీపీసీ బీ-టైప్ గేటు సమీపంలో నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య షాహిమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై కె.సతీష్ తెలిపారు.

నేర వార్తలు

కేశోరాం ఒప్పంద కార్మికుడి...

పాలకుర్తి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో కేశోరాం ఒప్పంద కార్మికుడు మృతి చెందాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి కథనం మేరకు... పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ వర్కర్స్ కాలనీకి చెందిన సందవేన గట్టయ్య (54) స్థానిక సిమెంట్ కర్మాగారంలో ఒప్పంద కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం తన స్వగ్రామమైన గోపాల్‌రావుపేటకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో జయ్యారం గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి...

ధర్మారం, న్యూస్‌టుడే: వరంగల్-రాయపట్నం రాష్ట్ర రహదారిపై మల్లాపూర్ వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన పచ్చిమట్ల జగ్గయ్య(77) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. పత్తిపాక రహదారి నుంచి మల్లాపురం వైపు సైకిల్‌పై వెళ్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో వెనుక వైపు నుంచి వస్తున్న టాటా గూడ్స్ వాహనం ఢీకొట్టింది. జగ్గయ్య తలకు, చేతులకు గాయాలవడంతో నగునూరులోని ప్రతిమ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవరు ఏదులాపురం మహేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు.

డీసీఎం వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ),న్యూస్‌టుడే: ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో అందులోని విద్యార్థినులు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్టీపీసీ, గౌతమినగర్‌కు చెందిన అయిదుగురు జూనియర్ కళాశాల విద్యార్థినులు రోజు మాదిరిగా ఆటోలో కళాశాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో లూర్దునగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఆటోను ఢీ కొనడటంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థినులకు, ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థిని ఐశ్వర్య తీవ్రంగా గాయపడింది. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు డీసీఎం వ్యాన్ డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎన్టీపీసీ ఎస్సై కె.సతీష్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన వ్యక్తిపై...

ముత్తారం, న్యూస్‌టుడే: పోతారం గ్రామానికి చెందిన ఓల్లెపు మొగిలి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వాటిని ముత్తారం ఠాణాకు తరలించి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

అధిక లోడ్‌తో వెళ్తున్న లారీల పట్టివేత

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: అధిక లోడ్‌తో వెళ్తున్న నాలుగు ఇసుక లారీలను బుధవారం న్యూ రచ్చపల్లి గ్రామ పరిసరాల్లో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇసుక లోడ్‌తో పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీలను అధికారులు ఆపి తనిఖీ చేశారు. లారీలను సీజ్ చేసి, మంథని ఠాణాకు తరలించారు. ముత్తారం తహసీల్దార్ సుమన్, డీటీ షఫీ, ఆర్ఐ శ్రీధర్, మంథని రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారికి గాయాలు

ధర్మారం, న్యూస్‌టుడే: బొట్లవనపర్తికి చెందిన వ్యాపారి సిరిపురం వెంకటేశం మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చామనపల్లి మీదుగా కటికెనపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రెండు గ్రామాల మధ్య అదుపు తప్పడంతో తలకు గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు వెంట ఇలా... వెళ్లేదెలా..!



ఎన్టీపీసీ పరిధిలోని మేడిపల్లి నుంచి అన్నపూర్ణకాలనీకి వెళ్లే రోడ్డుకు ఒకవైపున కంకర, ఇసుకను ఇష్టారాజ్యంగా వేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారి గుండా నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు, పాఠశాల బస్సులు ఉదయం, సాయంత్రం వేళల్లో వెళ్తుంటాయి. దారి మధ్యలో కంకర, ఇసుక పోయడంతో వాహనాలు వెళ్లడం కష్టతరంగా మారింది. ఒకే మార్గంలో వెళ్లాల్సి రావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని... అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జ్యోతినగర్(మార్కండేయకాలనీ)**

కొనుగోలు కేంద్రాల జాడేది?

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలో 27,723 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా.. ఖరీఫ్‌లో 19,332 ఎకరాల్లో వరి సాగుచేశారు. కొంతమంది రైతులు దళారులను ఆశ్రయించి ధాన్యం విక్రయిస్తుండగా.. ఇదే అదనుగా వారు రైతులను మోసం చేస్తున్నారు. మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2320, కామన్ గ్రేడ్ రూ.2300, ఉండగా దళారులు రైతుల దయనీయ స్థితిని ఆసరాగా చేసుకొని రూ.1800ల నుంచి రూ.1900ల వరకు చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, - కాల్వశ్రీరాంపూర్**



సాగుదారుల సర్వేపై గ్రామసభలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఎంజాయ్‌మెంట్(సాగు చేసే రైతుల) సర్వేపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలపాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. రామగిరి మండలం రాజాపూర్, బుధవారంపేట గ్రామాలకు సంబంధించిన ఎంజాయ్‌మెంట్ సర్వేపై బుధవారం ఆయన అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి రాజాపూర్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. బుధవారంపేట, రాజాపూర్‌లలో రెవెన్యూ రికార్డులు సరిచేయడానికి దాదాపు 708 ఎకరాల ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. అభ్యంతరాలుంటే దరఖాస్తులు సమర్పించాలన్నారు. రైతుల అంగీకారంతో సర్వే నివేదిక ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడానికి తహసీల్దార్, ఆర్డీవోలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా సర్వే సక్రమంగా చేయలేదని రైతులు అభ్యంతరం తెలిపారు. తిరిగి సర్వే చేసి న్యాయం చేయాలని విన్నవించారు. తమ సమస్య పరిష్కారమయ్యేవరకు 88 ఎకరాలకు అవార్డు పాస్ చేయొద్దని కోరారు. మంథని ఇన్‌ఛార్జి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ రాచంద్రరావు, ఆర్ఐ నిహారిక, రైతులు పాల్గొన్నారు.



రాజాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

బేగంపేట పాఠశాల తనిఖీ

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం ఆయన రామగిరి మండలం బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిచ్చిమొక్కలు, చెట్లతో నిండి ఉన్న ఆవరణను శుభ్రం చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద నిర్మించిన డైనింగ్ హాల్‌ను వినియోగించకపోవడంపై ఏఈ వరలక్ష్మితో మాట్లాడారు. డిసెంబరు వరకు పాఠశాలలో పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు మేరీ, ఉపాధ్యాయుడు రామకృష్ణారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధర్మారం, న్యూస్‌టుడే: నందిమేడారం సహకార సంఘం ఆధ్వర్యంలో సాయంపేట, బొట్లవనపర్తి, బుచ్చయ్యపల్లి, కానంపల్లి, నర్సింహులపల్లి, పైడిచింతలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ధర్మారం ఏఎంసీ ఛైర్మన్ లావుడ్యా రూప్లానాయక్, నందిమేడారం సహకార సంఘం ఛైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, వైస్ ఛైర్మన్లు అరిగె లింగయ్య, సామంతుల రాజమల్లు, డైరెక్టర్లు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు కొత్త నర్సింహం, గుర్రం మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



బొట్లవనపర్తిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూప్లానాయక్, బలరాంరెడ్డి తదితరులు

ఓదెల: గుంపుల, రూపునారాయణపేట, పొత్కపల్లి, ఓదెలల్లో ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సీహెచ్.విజయరమణారావు ప్రారంభించారు. ప్యాక్స్ ఛైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, నాయకులు ప్రేంసాగర్‌రెడ్డి, ఆకుల మహేందర్, చిన్నస్వామి, శంకర్, రవి, రజనీకాంత్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు. రూపునారాయణపేట వద్ద మానేరు వాగులో వంతెన నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం గుంపుల మానేరు వంతెనకు ఇరువైపులా పాడయిన రహదారికి మరమ్మతుపై పరిశీలించి అధికారులు, నాయకులకు సూచనలు చేశారు.

కమిషనరేట్‌లో గ్యార్వీషరీఫ్ వేడుకలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం పోలీసు కమిషనరేట్ హెడ్‌క్వార్టర్‌లో గ్యార్వీ షరీఫ్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీపీ శ్రీనివాస్ హాజరై జెండాను ఏర్పాటు చేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన చేశారు. భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రాజు, ఏసీపీ రాఘవేంద్రరావు, నర్సింహులు, సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, మల్లేం, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఏర్పాటు చేస్తున్న సీపీ శ్రీనివాస్

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంథని సీఐ రాజు అన్నారు. రామగిరి మండలం కల్వచర్లలో బుధవారం ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని 36 వాహనాలను పట్టుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ముత్తారం ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

రైలులో గర్భిణి ప్రసవం

పాలకుర్తి(రామగుండం), న్యూస్‌టుడే: రైలు ప్రయాణం చేస్తున్న గర్భిణి రైలులో ప్రసవించిన ఘటన రామగుండం రైల్వే స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమస్వాతి ఏపీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆగ్రా నుంచి కరీంనగర్‌లోని తల్లిగారింటికి వస్తోంది. మందమర్రి సమీపంలో పురిటి నొప్పులు రావడంతో టీటీఈ 108కు సమాచారమిచ్చారు. 108 సిబ్బంది ఈఎంటీ అబ్దుల్ చాంద్, పైలట్ రవిలు రామగుండం రైల్వే స్టేషన్‌కు చేరుకొని అత్యవసర సేవలు అందించగా మగశిబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించి రైలులోనే ప్రసవం చేసిన 108 సిబ్బందిని స్థానికులు, రైలు ప్రయాణికులు అభినందించారు.

మంచిర్యాల జిల్లాలో మద్దిరాల యువకుడి మృతి

హాజీపూర్, న్యూస్‌టుడే: వేంపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మద్దిరాలకు చెందిన మాటేటి శంకర్(39), వెల్గటూర్ మండలం చెగ్యాంకు చెందిన నడిమెట్ల పోచయ్యలు ద్విచక్రవాహనంపై మంచిర్యాలకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో అంతర్గాంకు వెళ్తుండగా వేంపల్లి వద్ద మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపునకు వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మాటేటి శంకర్, పోచయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మాటేటి శంకర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నడిమెట్ల పోచయ్య పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. హాజీపూర్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలపై ఆరా తీస్తున్నారు.

క్రీడా రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: క్రీడా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. భూపతిపూర్ బీసీ గురుకుల పాఠశాలలో అండర్-17 బాలుర వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు నవంబరులో సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురుకులాల జిల్లా కన్వీనర్ మణిదీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశం, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



భూపతిపూర్ గురుకులంలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

మిల్లర్లతో కుమ్మక్కైతే కఠిన చర్యలు: ప్యాక్స్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది మిల్లర్లతో కుమ్మక్కైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే విజయరమణారావు హెచ్చరించారు. సుల్తానాబాద్ మార్కెట్ యార్డులో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. డీసీవో శ్రీమాల, పురపాలిక ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి వినతి

పెద్దపల్లి: పెద్దపల్లి మినీ ట్యాంక్‌బండ్ సమీపంలో కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి శ్రీనివాస్, గండు రంగయ్య, బూతగడ్డ సంపత్, పోతాని పురుషోత్తంలు బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావుకు వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్తం

■ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ అండర్-17 ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో గర్రెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కుందేళ్ల చరణ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి గోదావరిఖనిలో జరగనున్న పోటీలకుహాజరు కానున్న అతడిని బుధవారం ప్రధానోపాధ్యాయురాలు కవిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆసియాబేగం, ఉపాధ్యాయులు అభినందించారు.

■ ఎకో పార్కు సుందరీకరణకు చర్యలు

మంథని, న్యూస్‌టుడే: మంథనిలోని ఎకో పార్కు సుందరీకరణకు మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. పార్కు అపరిశుభ్రంగా మారడంతో సుందరీకరణ పనులు చేపట్టింది. పార్కులో పాడైన పరికరాలకు మరమ్మతులు ప్రారంభించారు. బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి పనులను పరిశీలించారు. ఆమె వెంట కౌన్సిలర్ వికె రవి ఉన్నారు.

■ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై సమావేశం

మంథని, న్యూస్‌టుడే: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నవంబరు 6లోగా ఓటరుగా నమోదు చేసుకునే అంశంపై విస్తృత ప్రచారం చేయాలని మంథని ఆర్డీవో కార్యాలయ ఏవో రవీందర్ సూచించారు. బుధవారం ఆయన అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అజీమ్‌ఖాన్, పది మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

■ కస్తూర్బా విద్యాలయంలో డీఈవో తనిఖీ

జూలపల్లి, న్యూస్‌టుడే: తెలుకుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈవో మాధవి బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహం, భోజనశాలను పరిశీలించి సమస్యలపై విద్యార్థినులతో మాట్లాడారు. ఉపాధ్యాయినులతో సమావేశమై సూచనలు చేశారు. ఎస్‌వో శ్రీలత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

■ మత్స్యకారుల సమస్యలపై మంత్రికి వినతి

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: మంథని నియోజకవర్గంలో చేప పిల్లల పంపిణీ విషయంలో మత్స్యకారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పోతరవేని క్రాంతికుమార్ బుధవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు క్రాంతికుమార్ చెప్పారు.

మంథని: మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సంఘం ఛైర్మన్ కొత్త శ్రీనివాస్ బుధవారం మంత్రి శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు.

■ సంఘాలు-కార్యవర్గాలు

మంథని, న్యూస్‌టుడే: మంథని మైత్రి ఆటో యూనియన్ ఓనర్స్ డ్రైవర్స్ జేఏసీ మండల అధ్యక్షుడిగా జంజర్ల రమేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎస్‌కే గౌస్, ఉపాధ్యక్షుడిగా జడల రాము, ప్రధాన కార్యదర్శిగా తుంగ రాజు తదితర కార్యవర్గాన్ని నియమించినట్లు నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

■ ఎలిగేడులో వైద్య శిబిరం

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: ఎలిగేడులో బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు నిస్సి క్రిస్టినా, పంచాయతీ కార్యదర్శి అంజలి, వైద్య ఆరోగ్య సిబ్బంది సంపత్, విజయేందర్, లక్ష్మణ్, నాగమణి పాల్గొన్నారు.

■ హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భాజపా నాయకులు ఆరోపించారు. హామీల అమలు, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆర్డీవో గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ కన్వీనర్ సంతోష్, కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, రాజమహంతా కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

■ వెన్నంపల్లి రింగు రోడ్డుకు నిధులు మంజూరు

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఎమ్మెల్యే విజయరమణారావు పని చేస్తున్నారని మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లిలో రెండు వరుసల రహదారి(రింగ్ రోడ్డు)కు రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తూ మిఠాయిలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లంక సదయ్య, నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిపై అవగాహన

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి మల్టీడిపార్టుమెంటు కమిటీ ఆధ్వర్యంలో జీడీకే-11 గనిని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత అంశాలపై అవగాహన కల్పించారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెరపై వివరించారు. ప్రతి ఒక్కరు సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, అంకిత భావంతో పని చేయాలని సూచించారు. నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని, రవాణా విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్మికుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తికి కృషిచేయాలన్నారు. ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఏజెంటు శ్రీనివాస్, అధికారులు మల్లేశం, రాందాస్, ఆంజనేయులు, రాజన్న, రవీందర్‌రెడ్డి, సుధీర్‌కుమార్, హన్మాండ్లు, గుర్తింపు సంఘం నాయకులు కె.స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జీఎం లలిత్‌కుమార్, అధికారులు, కార్మికులు

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు శిక్షణ

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభించిన శిక్షణ తరగతులను ఈనెల 26 వరకు నిర్వహించనున్నారు. గుర్తింపు సంఘం నాయకులు కె.రాజ్‌కుమార్, ఎల్.ప్రకాశ్, వై.వి.రావు, ఎం.ఎల్లయ్యగౌడ్, వీరభద్రం, వెంకట్, పోశం, రవీందర్, రాంచంద్రారెడ్డి, భాజీసైదా, కె.మల్లికార్జునలు హాజరయ్యారు. ప్రాతినిధ్య సంఘం నుంచి బి.జనక్‌ప్రసాద్, త్యాగరాజన్, సమ్మయ్య, రవీందర్‌రెడ్డి, వికాస్‌కుమార్‌లు పాల్గొన్నారు.



కబడ్డీ విజేత ఆర్జీ-I, 2 జట్టు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి స్థాయి కబడ్డీ పోటీల్లో రామగుండం-1, 2 జట్టు విజయం సాధించింది. గోదావరిఖని సింగరేణి క్రీడా మైదానంలో బుధవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో ఆర్జీ-3 భూపాలపల్లి జట్టుపై ఆర్జీ-1, 2 జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. హోరాహోరీగా జరిగిన పోటీల్లో ఆర్జీ-1, 2 జట్టు 51 పాయింట్లు సాధించగా ఆర్జీ-3 భూపాలపల్లి జట్టు 39 పాయింట్లు మాత్రమే సాధించింది. విజేతగా నిలిచిన జట్టుకు జీఎం లలిత్‌కుమార్, ఖని ఏసీపీ రమేష్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు అనిత, అధికారులు రాంమోహన్, కిరణ్‌బాబు, సారంగపాణి, గుర్తింపు సంఘం నాయకులు కె.స్వామి, అధికారుల సంఘం ప్రతినిధి క్రాంతిలు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన ఆర్జీ-I, 2 జట్టు

ప్రధాన మురుగు కాలువ నిర్మించాలని వినతి

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: రామగుండం నగరపాలక 25వ డివిజన్ గోదావరిఖని టీచర్స్ కాలనీ పక్కనుంచి ప్రధాన మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలని టీచర్స్ కాలనీకి చెందిన ఆర్.శంకర్‌తో పాటు పలువురు నగరపాలక అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. వివిధ కాలనీలకు సంబంధించిన మురుగునీరు నేరుగా టీచర్స్ కాలనీ పక్కనుంచి ప్రవహిస్తుండడంతో దుర్గంధంతో పాటు పందులు, దోమల బెడద తీవ్రంగా ఉందని వాపోయారు. పాలకవర్గం, అధికారులు స్పందించి సత్వరమే ప్రధాన మురుగు కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆసుపత్రిలో వసతులపై...

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయ సీనియర్ సహాయకుడు వంశీకృష్ణకు భారాస నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు ఇంజక్షన్లు ప్రైవేటు ఔషధ దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లు తొలగించి కొత్తవి నిర్మించాలన్నారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, నాయకులు నీలం శ్రీనివాస్, తోట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మృతికి సంతాపం

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారం మాజీ ప్రెసిడెంట్ కేసీ జైన్ (84) హైదరాబాద్‌లో అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. 1969 సంవత్సరంలో బీకే.బిర్లా గ్రూపునకు చెందిన కేశోరాం సిమెంట్ కర్మాగారాన్ని బసంత్‌నగర్‌లో స్థాపించగా ఆయన ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి 2018 వరకు కేశోరాం సిమెంట్ సీఎస్సార్ ద్వారా కేసీ జైన్ ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టారు. సిమెంట్ కర్మాగార ప్రభావిత ప్రాంతాలకు ఉపాధి అవకాశాలు కల్పించారు. పలు గ్రామాల్లో దేవాలయ నిర్మాణాలకు ఉచితంగా సిమెంట్‌ను అందజేశారు. ఆయన మృతి పట్ల కేశోరాం కార్మికులు, స్థానికులు సంతాపం తెలిపారు.